ప్రగతిపథంలో అమీన్‌పూర్ మున్సిపాలిటీ

- రూ.రెండున్నర కోట్లతో రాక్‌గార్డెన్
- లింక్ రోడ్డుతో ట్రాఫిక్ చిక్కులకు చెక్


రాక్‌గార్డెన్ స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించనుంది. అమీన్‌పూర్–బొల్లారం రోడ్డుకు అనుసంధానంగా నవ్య రోడ్డును కలుపుతూ పాత గ్రామం ఇవతలి నుంచి ప్రత్యేక రోడ్డును ఏర్పాటు చేయనున్నారు. ఇందు కోసం కావాల్సిన నిధులను ఏర్పాటు చేశారు. భారత్ పెట్రోల్ పంప్ నుంచి భరత్‌నగర్ మీదుగా నవ్య వెళ్లే రోడ్డులో యాక్సిస్ పావహోమ్స్‌కు సమీపంలో లింక్‌ను ఏర్పాటు చేయనున్నారు. లింక్ రోడ్డు ఏర్పాటుతో కిష్టారెడ్డిపేట మీదుగా లింగంపల్లికి ప్రయాణికులు సులువుగా రాకపోకలు సాగించవచ్చు.

రూ.రెండున్నర కోట్లతో పనులు..

సర్వే నెంబర్ 993లో మహిమ మినిస్ట్రీస్ వెనకవైపు రాక్‌గార్డెన్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. రూ.రెండున్నర కోట్లతో లింక్ రోడ్డు ఫార్మేషన్, రాక్ గార్డెన్ ఏర్పాటు చేయనున్నారు. అమీన్‌పూర్ పాత గ్రామం మీదుగా ప్రస్తుతం రాకపోకలు సాగిస్తుండగా పెట్రోల్ పంప్ వైపు నుంచి భరత్‌నగర్ మీదుగా ఏర్పాటుకానున్న రోడ్డుతో ప్రయాణికులు అమీన్‌పూర్ పాత గ్రామంలోకి వెళ్లాల్సిన అవసరం లేకుండానే రాకపోకలు సాగించవచ్చు. దాంతో గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు ఉండవు. భవిష్యత్‌లో గ్రామంలోని పాత ఇళ్లను కూల్చి రోడ్డు విస్తరించాలనే సమస్య ఉత్పన్నం కాదు.

మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం

అమీన్‌పూర్‌లో ప్రధాన రోడ్లను అభివృద్ధి చేయాలనేది లక్ష్యం. అందుకోసం ప్రణాళికలను రూపొందిస్తున్నాం. నవ్య–అమీన్‌పూర్ రోడ్డు నిర్మాణం పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. అమీన్‌పూర్ లింగంపల్లి రోడ్డుకు రూ.ఏడున్నర కోట్లు మంజూరయ్యాయి. మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతాం.

– తుమ్మల పాండురంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్, అమీన్‌పూర్

పచ్చిరొట్ట విత్తనాలతో లాభాలు

ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్


పచ్చిరొట్ట ఎరువులను అందజేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): పచ్చిరొట్ట ఎరువు విత్తనాలతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. బుధవారం జోగిపేటలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆగ్రోస్ రైతు సేవాకేంద్రం 1, 2 ద్వారా పంపిణీ చేస్తున్న జీలుగా, జనుము స్టాక్ వివరాలను అధికారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, మండల సమన్వయ సమితి కోఆర్డినేటర్ వర్కల అశోక్, సహాయ వ్యవసాయ సంచాలకులు అరుణ, మండల వ్యవసాయ అధికారి విజయరత్న, గ్రామ రైతుబంధు సమితి కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహార్యాలీని విజయవంతం చేయాలి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న లింగాయత్‌లు

నారాయణఖేడ్: హైదరాబాద్‌లో వచ్చే నెల 4న నిర్వహించనున్న లింగాయత్‌ల మహార్యాలీని విజయవంతం చేయాలని వీరశైవలింగాయత్ సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పట్లోళ్ల సంగమేశ్వర్, రాష్ట్ర అధ్యక్షులు వెన్న ఈశ్వరప్ప కోరారు. బుధవారం మహార్యాలీకి సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఖేడ్ బసవమంటపంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కర్ణాటకలోని బాల్కి హిరేమఠానికి చెందిన మహాలింగదేవరు, సంఘ అఖిల భారత సమన్వయక మిటీ అధ్యక్షులు అవినాష్, అన్విశానందస్వామి, ఖేడ్ ప్రాంత లింగాయత్‌లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


నారాయణఖేడ్: రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

నారాయణఖేడ్: ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తుంటే సమాచారం ఇవ్వాలని ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి కోరారు. నారాయణఖేడ్ సబ్ డివిజన్ టాస్క్‌ఫోర్స్ అధికారిణిగా వ్యవహరిస్తున్న సంగారెడ్డి ఏడీఏ అంబిక, ఎస్‌ఐ రాములు, ఖేడ్ ఇన్‌చార్జి ఏడీఏ శంకర్ తదితరులతో కూడిన అధికారులు బుధవారం ఖేడ్‌లోని ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాముల్లో నిల్వ ఉన్న విత్తనాల రశీదులు, రికార్డులను పరిశీలించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

న్యాల్‌కల్ (జహీరాబాద్): నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ మండల అధికారి లావణ్య హెచ్చరించారు. బుధవారం న్యాల్‌కల్‌లోని వేంకటేశ్వర ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ విక్రయ దుకాణాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని దుకాదారులకు సూచించారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


రైతులకు విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం జిన్నారం వ్యవసాయ కార్యాలయంలో రైతులకు జీలుగ విత్తనాలను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రైతులకు అందజేశారు. అనంతరం రూ.16లక్షలతో నిర్మించనున్న గ్రంథాలయ ప్రహరీ, రూ.10లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిన్నారం మండల కేంద్రంలో నూతనంగా సివిల్ కోర్టు మంజూరైందన్నారు. త్వరలోనే కోర్టుకు సంబంధించిన పనులు ప్రారంభవుతాయని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేవిధంగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, సర్పంచ్ లావణ్య, ఉపసర్పంచ్ సంజీవ, ప్రజాప్రతినిధులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏల సమ్మెపై నిర్బంధం తగదు


మాట్లాడుతున్న సాయిలు

జోగిపేట (అందోల్): వీఓఏల సమ్మెపై ప్రభుత్వ నిర్బంధం తగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. బుధవారం జోగిపేటలో వీఓఏలు చేపడుతున్న నిరవధిక సమ్మెలో పాల్గొని మాట్లాడారు. శాంతియుతంగా సమ్మె చేస్తున్న వారిపై నిర్బంధాన్ని ప్రయోగిస్తూ అరెస్టులు, లాఠీచార్జీలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వీఓఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి విద్యాసాగర్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, మిషన్ భగీరథ యూనియన్ జిల్లా కార్యదర్శి రాములు పాల్గొన్నారు.

‘అకౌంట్ అప్‌డేట్ ఉంటే ఆధార్‌తో పనిలేదు’

నర్సాపూర్: బ్యాంకులో ఖాతా అప్‌డేట్ అయి ఉంటే పెద్ద నోట్లను ఖాతాలో జమ చేసేందుకు ఆధార్ కార్డుతో పని లేదని ఎస్‌బీఐ శాఖ మేనేజర్ సత్యనారాయణరావు చెప్పారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ... రూ.2000 నోట్లను ఆర్‌బీఐ ఉపసంహరించిన నేపథ్యంలో వాటిని బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ఖాతాదారులకు పలు సూచనలు చేశారు. బ్యాంకు ఖాతాతో గతంలోనే ఆధార్ కార్డు నంబర్‌ను నమోదు చేసి, ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. అలాంటి ఖాతాదారులు ఆర్‌బీఐ నిబంధనల మేరకు రెండు వేల రూపాయల పది నోట్లను ఒక దఫా తమ ఖాతాలో జమ చేసుకోవచ్చని సూచించారు. కొందరు ఖాతాదారులు ఆధార్ కార్డు నంబర్‌ను బ్యాంకు ఖాతాతో నమోదు చేయలేదని, అలాంటి ఖాతాదారులు ప్రస్తుతం తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీని తమ సిబ్బందికి అందజేస్తే వారు ఆధార్ నంబర్‌ను బ్యాంకు ఖాతాతో అప్‌డేట్ చేస్తారని వివరించారు. ఆధార్ నంబర్ అప్‌డేట్ చేసిన అనంతరం రూ.2000 నోట్లను తమ ఖాతాలో జమ చేసుకోవచ్చని చెప్పారు. కాగా తమ బ్యాంకులో ఆర్‌బీఐ సూచనల ప్రకారం రూ.2000 నోట్ల జమ కార్యక్రమం సజావుగా కొనసాగుతుందన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి


మాట్లాడుతున్న ఎంపీపీ ప్రియాంకరెడ్డి

జహీరాబాద్: ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఎంపీపీ ప్రియాంకరెడ్డి, జెడ్పీటీసీ అరుణరెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే విన్నపాలపై నిర్లక్ష్యం వహించొద్దన్నారు. విద్యుత్‌రంగ సమస్యలు అధికంగా వస్తున్నాయని, వాటిని గుర్తించి వెంటనే పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలకు నీటిని అందించాలన్నారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడుతూ వానాకాలం సీజన్‌కు అవసరం మేరకు విత్తనాలను సకాలంలో అందుబాటులో ఉండేవిధంగా అధికారులు ఏర్పాట్లు చేయాలని కోరారు. రాయిపల్లి తండాలో అవసరం మేరకు కరెంటు స్తంభాలు, సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని సభ్యులు విన్నవించారు. అదేవిధంగా క్రీడాప్రాంగణాలకు సంబంధించిన బిల్లులను చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు ఉంటేనే దరఖాస్తులు స్వీకరించాలి


మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్

కోహీర్: కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలకు మీసేవకు వచ్చే అర్జీదారుల వద్ద అన్ని పత్రాలు సక్రమంగా ఉంటేనే మీ–సేవ ఆపరేటర్లు దరఖాస్తులు స్వీకరించి మీ–సేవ పోర్టల్‌లో పొందుపర్చాలని డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయా గ్రామాల మీ–సేవ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ భూ రిజిస్ట్రేషన్లకు సంబంధించి స్లాట్ బుకింగ్ విషయంలో మీ–సేవ ఆపరేటర్లు జాగ్రత్తగా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. దరఖాస్తు చేయడంలో పొరపాట్లు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్‌రెడ్డి, సీఓ అయ్యూబ్, మీ–సేవ ఆపరేటర్లు మల్లేశం, ముజాహిద్, సాగర్, అజీమ్, మతీన్ పాల్గొన్నారు

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న పూజ

కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డి పట్టణ కేంద్రంలో తారా కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిపై షేవింగ్ బ్లేడ్‌తో దాడి చేసిన ప్రవీణ్ అనే నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పూజ అన్నారు. బుధవారం సంగారెడ్డిలోని ఏబీవీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం షీటీంలు ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోతోందన్నారు. ప్రభుత్వం స్పందించి మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. సమావేశంలో ఏబీవీపీ నగర కార్యదర్శి వెంకట్, నాయకులు గిరిబాబు, స్వప్న, రాకేష్ పాల్గొన్నారు.

విరాళం అందజేత


చెక్కును అందజేస్తున్న బ్యాంకర్లు

సంగారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు, సీఎం కప్ నిర్వాహణకు బుధవారం అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వివిధ బ్యాంకుల ప్రతినిధులు రూ.2 లక్షల 36వేల చెక్కును విరాళంగా అందజేశారు.

ఐకేపీ వీఆర్ఏలకు ట్రెస్సా మద్దతు

జిన్నారం(పటాన్‌చెరు): వీఆర్ఏలకు ట్రెస్సా పూర్తి మద్దతుగా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ట్రెస్సా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ట్రెస్సా కార్యదర్శి గౌతమ్‌కుమార్‌తో కలిసి గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి వీఆర్ఏల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్ఏలకు పదోన్నతులు ఎలా వస్తాయో వివరించామన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే సమిష్టి కృషితో పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్ఏలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్


మాట్లాడుతున్న మున్సిపల్ వైస్‌చైర్మన్

సదాశివపేట(సంగారెడ్డి): ప్రతిఒక్కరూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతా గోపాల్ అన్నారు. బుధవారం పట్టణంలో భవన నిర్మాణ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సునీత ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని చింతా గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా మందులు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ వెంకట్, అనిల్ కుమార్, లాలప్ప, చంద్రశేఖర్, రఘుపతి, ఈశ్వర్, ఆనందం, పద్మ, భూదేవి, నర్సమ్మ, ఖాజాబీ, నస్రీన్ పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా హోర్డింగ్‌ల ఏర్పాటు

- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు


హైమాస్ట్ లైట్‌కు అడ్డంగా భారీ హోర్డింగ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇష్టానుసారంగా హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెల్లాపూర్ నుంచి కొల్లూర్ రింగ్ రోడ్డు వరకు రోడియల్ రోడ్డు పక్కన అనేక చోట్ల భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల వీచిన గాలులకు హోర్డింగ్‌లకు ఉన్న ప్లెక్సీలు విద్యుత్ తీగల మీద పడ్డాయి. అదే రోడ్డు మీద పడి ఉంటే ఎంత ప్రమాదం జరిగి ఉండేదో అర్థం చేసుకోవచ్చు. నిత్యం రద్దీగా ఉండే ఏలియాన్స్ చౌరస్తాలో గతంలో ప్రమాదాలను నియంత్రించేందుకు ఐమాస్ట్ లైట్లను, సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాటికి అడ్డంగా భారీ హోర్డింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హోర్డింగ్‌లకు అనుమతులు ఇవ్వకూడదని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బీమా చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: కంగ్టి మండల పరిధిలోని రాంతీర్థ్ ఉపసర్పంచ్ బీరాదర్ జ్ఞానేశ్వర్ ఆరునెలల క్రితం ఖేడ్‌లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతను బీఆర్ఎస్ క్రియాశీల సభ్యుడు కావడంతో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును మృతుడి తండ్రి నర్సింగ్‌రావుకు బుధవారం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో రాంతీర్థ్, బోర్గి సర్పంచ్‌లు శరణప్ప, గజానంద్, నాయకులు రవీందర్‌నాయక్, పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి డీఆర్డీఓగా మెంచు నగేష్, సంగారెడ్డి ఆర్డీఓగా రవీందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ శరత్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి పాలనలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

గురుమూర్తికి పాద పూజ


పాద పూజ చేస్తున్న భక్తులు

మునిపల్లి(అందోల్): నర్సాపూర్ మండలం నృసింహాపురం (రుస్తుంపేట) ఆత్మానందాశ్రమ పీఠాధిపతి భగవద్భక్త పరాగ పూజ్యపాద గురు రాజయోగి వెంకటస్వామికి ఆయా గ్రామాల భక్తులు పాదపూజ నిర్వహించారు. బుధవారం మండలంలోని అంతారం గ్రామంతో పాటు ఆయా గ్రామాలలో భక్తులు గురుమూర్తికి పాదపూజ నిర్వహించి ఆశీర్వచనం తీసుకున్నారు. పూజా కార్యక్రమానికి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ట్రిపుల్‌ఆర్ కేంద్రం ప్రారంభం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో రియూజ్, రెడ్యూజ్, రీసైకిల్ కేంద్రాన్ని బుధవారం మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులు, దుస్తులను, పుస్తకాలను ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల్లో ఇవ్వాలని స్థానికులకు సూచించారు. సేకరించిన వస్తువులను అవసరమైన పేదలకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు జ్యోతి, చిట్టి, రవీందర్‌రెడ్డి, నాయకులు శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ చెక్కు పంపిణీ

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వం తాపీమేస్త్రీలకు అండగా ఉంటుందని గుమ్మడిదల మండల మణికంఠ తాపీమేస్త్రీల యూనియన్ సభ్యులు అన్నారు. ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన యూనియన్ సభ్యుడు పుట్నాల వెంకటయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన బీమా ద్వారా మంజూరైన రూ.లక్షా ముప్పై వేల బీమా చెక్కును బుధవారం మృతుడి భార్య నర్సమ్మకు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నారాయణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్, సభ్యులు డిల్లేశ్వరరావు, దాసు, కోటయ్య, ఈశ్వర్ పాల్గొన్నారు.

◆ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంపై హర్షం

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి జిల్లా మెడికల్ ఆసుపత్రిలో 37 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను నియమించడంపై టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ మేరకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను నియమించడంతో చింతా ప్రభాకర్ సీఎం కేసీఆర్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని పాశమైలారం గ్రామంలో కొనసాగుతున్న దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో బుధవారం పటాన్‌చెరు కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, ఇస్నాపూర్ ఎంపీటీసీ శ్రీశైలం, ఇస్నాపూర్ సర్పంచ్ బాలమణి, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

◆ ఉపాధి పనుల పరిశీలన



నారాయణఖేడ్: మండల పరిధిలోని హన్మంత్‌రావుపేట్, పోతన్‌పల్లి, మాద్వార్ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ పథకం పనులను ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల సంఖ్య పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.

◆ సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సదాశివపేట(సంగారెడ్డి): సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు చింతా సాయినాథ్ అన్నారు. బుధవారం పట్టణంలో చింతా ప్రభాకర్ నివాసంలో మండల పరిధిలోని సురారం గ్రామానికి చెందిన అతీఫ్ నిమ్స్ ఆస్పత్రిలో సర్జరీ నిమిత్తం మంజూరైన ఎల్ఓసీని అతిఫ్ తండ్రి జహిరోద్దీన్‌కు అందజేశారు.

◆ ఏకగ్రీవంగా ఎన్నిక

జోగిపేట (అందోల్): జిల్లా భట్రాజు యువజన సంఘం ఎన్నికలు బుధవారం జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా భట్రాజు సంఘం అధ్యక్షుడు నందిభట్ల నర్సింహరాజు ఆధ్వర్యంలో పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా యువజన సంఘం అధ్యక్షులుగా వరకవి వేణుగోపాల్ రాజు, ప్రధాన కార్యదర్శిగా సరస్వతి సంపత్ రాజు, కోశాధికారిగా కాంచనపల్లి వంశీకృష్ణ, ఉపాధ్యక్షులుగా హరిదాసు నర్సింహ్మారాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్ రాజు, రంగరాజు, గిరిధర్ రాజు, శ్యామ్ రాజు, వీర్రాజు, రాంబాబు పాల్గొన్నారు.

◆ దరఖాస్తు చేసుకోవాలి

మునిపల్లి(అందోల్): మోడల్ స్కూల్‌లో ప్రవేశాల కోసం పరీక్ష రాసి మెరిట్ సాధించిన విద్యార్థులు ఈ నెల 25వ తేదీ నుంచి మునిపల్లి మోడల్ స్కూల్‌లో మెరిట్ కాపీ తీసుకుని దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతిలో ప్రవేశానికి 157 మంది పరీక్ష రాయగా వారిలో వందమంది విద్యార్థులు మెరిట్ సాధించారని తెలిపారు. మెరిట్ సాధించిన విద్యార్థులు ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

◆ కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పలు కాలనీల్లోని మురుగుకాల్వల్లో పేరుకుపోయిన మురుగును తొలగించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. పారిశుద్ధ్య పనులను శానిటరీ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

◆ ఆలయ నిర్మాణానికి విరాళం



జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని సోలక్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఇమాంనగర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ దేవాలయ నిర్మాణానికి చిట్కుల్ సర్పంచ్ నీలం మధు బుధవారం రూ.1.50లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల నిర్మాణాలకు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు బాలకృష్ణ, శ్రీకాంత్, శ్రీనివాస్, మహేష్, వినోద్ పాల్గొన్నారు.

◆ వ్యాక్సినేషన్‌ను సద్వినియెగం చేసుకోవాలి

రాయికోడ్(అందోల్): మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టే పశువుల రోగాల నివారణకు ఇచ్చే ఉచిత వ్యాక్సినేషన్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. బుధవారం రాయికోడ్‌లో పశువులకు గొంతువాపు, జబ్బు, వాపురోగాల నివారణకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పోషకులు పాల్గొన్నారు.

◆ నేడు చిన్నారులకు స్వర్ణామృత ప్రాస మందు

జహీరాబాద్: ఈ నెల 25వ తేదీన జహీరాబాద్ పట్టణంలో చిన్న జీయర్‌స్వామి వారి సహకారంతో వికాస తరంగిణి ఆధ్వర్యంలో చిన్నారులకు స్వర్ణామృత ప్రాస చుక్కల మందు వేయనున్నట్లు సంస్థ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జహీరాబాద్ పట్టణంలోని బ్లాక్‌రోడ్డులోని శ్రీదత్తసాయి క్లీనిక్‌లో ఉదయం 10 గంటలకు 16 సంవత్సరాల లోపు పిల్లలందరికి రెండు చుక్కల స్వర్ణామృత ప్రాస వేయబడుతుందని పేర్కొన్నారు.

◆ అభయ ఆంజనేయస్వామి ఉత్సవాలు

పుల్‌కల్(అందోల్): మండల పరదిలోని మిన్‌పూర్‌లో నూతనంగ నిర్మించిన అభయ అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను ఘనంగ నిర్వహిస్తున్నారు.రెండు రోజుల నుండి వేద పండితులు వివిద దార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.రాత్రి వేళల్లో భజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

◆ భవానీ మాత ఆలయంలో పూజలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని చీకూర్తి గ్రామంలోని భవానీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయం ఆవరణలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

◆ అందుబాటులో 20 లారీలు

నారాయణఖేడ్: రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించేందుకు ఖేడ్‌లో బుధవారం 20 లారీలను అధికారులు సమకూర్చి కొనుగోలు కేంద్రాలకు పంపారు. ఖేడ్ తహశీల్దార్ మురళీధర్, ఆర్ఐ మాధవరెడ్డి, ఐకేపీ ఏపీఎం టిక్యానాయక్, సీఏలు సమావేశమై త్వరితగతిన ధాన్యం తరలించాలని రైసుమిల్లర్లకు సూచించారు.

◆ కొనసాగుతున్న వీఓఏల సమ్మె



ఝరాసంగం(జహీరాబాద్): సమస్యలు పరిష్కరించాలని ఝరాసంగం ఐకేపీ కార్యాలయం ఆవరణలో ఐకేపీ వీఓఏలు చేపట్టిన సమ్మె బుధవారంతో 38వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఓఏలు, నాయకులు పాల్గొన్నారు.